



అంగన్వాడీ కార్యకర్తను పరామర్శిస్తున్న నాయకులు

సందేహాల నివృత్తికే అదాలత్

- ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళిసింగ్

ప్రజాశక్తి - కడప

ఉద్యోగుల పెన్షన్, జిపిఎఫ్‌లకు సంబంధించి వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకే అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో అకౌంటెంట్ జనరల్, డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో ఉన్న ఉద్యోగుల జిపిఎఫ్, పెన్షన్ సమస్యలపై అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి విరమణ అయిన మరుసటి రోజునే పింఛను మంజూరు చేయాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఉద్యోగి ఆరు నెలల లోపుగా అన్ని డాక్యుమెంట్లను పంపించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ అయ్యే సమయానికి సర్వీస్ రిజిస్టర్ అప్డేట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. సర్వీస్ రిజిస్టర్‌లో అన్ని ఎంట్రీస్ కరెక్ట్‌గా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఉద్యోగులు ఎటువంటి రుణం, పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పెన్షన్ డాక్యుమెంట్స్ తమకు అందిన వెంటనే ఎజి నియమ నిబంధనల ప్రకారం వేగవంతంగా పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తమ దృష్టికి రాని జిపిఎఫ్, పెన్షన్ సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే అదాలత్ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సు అనంతరం జిల్లా వ్యాప్తంగా విరమణ చేసిన పలువురు ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌లను, 30 మందికి జిపిఎఫ్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లు సునీత, చంద్రశేఖర్, భవాని ప్రసాద్, విజయ్ కుమార్,కడప ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, సబ్ ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అకౌంటెంట్ జనగరల్ చంద్రమౌళిసింగ్

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - కడప

జిల్లా కేంద్రంలో నవంబర్ 10 నుండి 15 వరకు నిర్వహించబోయే అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణ ఏర్పాట్లపై రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్, ఎస్‌పి కె. ప్రకాష్ బాబు, రిక్రూట్మెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ అమర్ దీప్ కుమార్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీలో చేరబోయే అయ్యే వారికోసం ఇప్పటికే రాత పరీక్ష పూర్తయి అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహించేందుకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేదికగా మారనుందన్నారు. రాష్ట్రంలోని కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. వారందరికీ మౌలిక సదుపాయాలను కడప నగర పాలక సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో మైదానంలో రిక్రూట్మెంట్ బోర్డు విధి విధానాలు అనుగుణంగా టెంట్లు, బారికేడ్లు, విద్యుత్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్ తదితర మౌలిక ఏర్పాట్లను సమకూర్చాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ ఇర్విన్, ఎఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, ఎల్ఎంవిఐ. విజయ్ భాస్కర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఉమామహేశ్వరకుమార్, ఆర్అండ్‌బి, పిఆర్, డిఎస్ఎ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశు గణన సర్వేను పక్కాగా నిర్వహించాలి

జిల్లాలో ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించే 21వ పశు గణన సర్వేని పక్కాగా చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్, కడప ఎమ్మెల్యే మాధవి వేర్వేరు కార్యక్రమాల్లో పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో డిఆర్ఒ గంగాధర్ గౌడ్, డిపిఒ రాజ్యలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ శారదమ్మ, నోడల్ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ రెడ్డి, పశు వైద్యాధికారి అనుపమ లతో కలిసి 21వ పశు గణన సర్వేకి సంబంధించిన ప్రచార పోస్టర్లను, స్టిక్కర్లను జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే కడప ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి సంబంధిత అధికారులతో 21వ పశుగణన సర్వేకి సంబందించిన పోస్టర్లను, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశు సంపద అనేది దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధాన్యమైందని చెప్పారు. ఆవులు, గేదలు, మేకలు, గొర్రెలు, కోళ్ల మొదలైన పశు సంపద మన రైతులకు జీవనోపాధినిచ్చే వనరులు మాత్రమే కాదని, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివి అన్నారు. ఇంటింటి సర్వేకి వచ్చే అధికారులకు సహకరించి కచ్చితమైన వివరాలను అందించాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు పిలుపునిచ్చారు.



కృష్ణారావుకు ఉత్తర్వు అందజేస్తున్న విసి, రిజిస్ట్రార్

పరీక్షల నియంత్రణ అధికారిగా కృష్ణారావు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్)గా రసాయన శాస్త్ర శాఖ ఆచార్యులు కె.ఎస్‌పి కృష్ణారావు నియమితులయ్యారు. ఆచార్య కృష్ణారావుకు గురువారం విసి ఛాంబర్‌లో విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ నియామకపు ఉత్తర్వు అందజేశారు. ఇదివరకు ఆయన స్థానంలో పనిచేస్తున్న ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి విమరణ చేయడంతో ప్రస్తుంత కృష్ణారావును నియమించారు. పరీక్షల విభాగం చాలా బాధ్యతతో కూడుకుందని గుర్తు చేస్తూ ప్రభావవంతంగా పనిచేయాలని నూతన విసి సూచించారు. **సిడిసి అసోసియేట్ డీన్‌గా డాక్టర్ గంగయ్య..** యోగివేమన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. గంగయ్యను కళాశాల డెలంమెంట్ కౌన్సిల్ అసోసియేట్ డీన్‌గా నియమించారు. డాక్టర్ గంగయ్యకు విసి ఛాంబర్‌లో విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ నియామక ఉత్తర్వు అందజేశారు. కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, ఆచార్య కృష్ణారావు, దూరవిద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నియంత్రించాలంటూ ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న మత్తు పదార్థాల విక్రయాలపై టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి బాధిత కుటుంబ సభ్యులతో ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే , పొలిట్‌బ్యూరో సభ్యులు మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడిన యువకుల కుటుంబ సభ్యులే ముందుకు వచ్చి తమ పిల్లలు ఈ మత్తు మహమ్మారి నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవాలని, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని అని విజ్ఞప్తి చేస్తుంటే పరిస్థితి ఎంత చేయి జారిపోతుందో అర్థమవుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో యువతను మత్తుకు బానిసలు చేశారని పేర్కొన్నారు. నగర పోలీసులు గంజాయి, మాదకద్రవ్యాలను అదుపులోకి తీసుకురావడంతో, వాటికి అలవాటు పడిన బానిసలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడని కొన్ని మందులను, వివిధ రసాయనాలతో కలిపి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి కెమిస్టు, డ్రగ్గిస్టులపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



డ్రగ్స్ విక్రయాలు నియంత్రించాలని ఎస్‌పికి విన్నవిస్తున్న మహిళలు

'పాపాగ్ని'లో భారీగా ఇసుక తవ్వకాలు

- తాగునీటి బోర్లలో తగ్గుతున్న నీటి మట్టం
- పట్టని అధికారులు
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉచితంగా ట్రాక్టర్లు ఇసుకను తరలించుకోవచ్చని అనుమతి ఇవ్వడంతో వేంపల్లెలోని పాపాగ్ని నదిలో భారీగా ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తవ్వకాలు చేపట్టారు. దీంతో తాగునీటి బోర్లలో నీటి మట్టం తగ్గుతుందని రైతులు, ప్రజలు వాపోతున్నారు. గతంలో పాపాగ్ని నుంచి ఇసుకను తరలిస్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తుండడంతో దొంగచాటునా ట్రాక్టర్ల యాజమానులు తవ్వకాలు చేపట్టేవారు. వంకలు, వాగులు నుండి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల నుంచి ఉచితంగా ఇసుకను తరలించుకో వచ్చని కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడంతో పట్ట పగలే వందలాది ట్రాక్టర్ల పాపాగ్ని నదిలోకి వెళ్లి ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు ఎలాంటి ఆంక్షలు పెట్టక పోవడంతో ట్రాక్టర్ యాజమానులు ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇంటి అవసరాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ట్రాక్టర్లతో ఇసుకను తరలించవచ్చు అని చెప్పింది. కొందరు ట్రాక్టర్లు యాజమానులు ఇదే ఆసరాగా చేసుకుని నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టి ఇటుకల బట్టిల వద్ద, ఇతర ప్రాంతాల్లో ఇసుకను డంప్‌లుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇసుక ఉచితం అనడంతో వైసిపి, టిడిపికి చెందిన ట్రాక్టర్ యాజమానులు జెసిబితో ఇసుకును లోడి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. నదిలోనే మండల వాసుల కోసం తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు. ఇసుక తవ్వకాల వల్ల భవిష్యత్‌లో మండలంలోని ఆయా గ్రామా లకు తాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు నదికి అవతల ఒడ్డున్న పంట పొలాలకు సాగునీటికి ఇబ్బం దులు వస్తాయని రైతులూ ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 150 ట్రాక్టర్లు రోజూ పాపాగ్ని నదిలో ఇసుకను తవ్వకాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు ఇసుక తవ్వకాలను నియంత్రించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పాపాగ్ని నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు



మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ఉచిత గ్యాస్, బస్సు ప్రయాణం అమలు చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

ఎపిలో మహిళలు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందో చెప్పాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి ప్రశ్నించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారు మాట్లాడారు. సాక్షాత్తు దేశ ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నకిలీ కోర్టు ఉండడం దురదృష్టకరం అన్నారు. ఇలాగైతే బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న దొంగలను ఏం పట్టుకుంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా అందరికీ అమలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం నిల్, తండ్రికి ఇంధనం ఫుల్ అని వారు ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. కానీ ప్రస్తుతం దీపం పథకం, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం లదిదారులకు, తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారికే అని షరతులు పెట్టడం సమంజసం కాదు అన్నారు. ఇకనైనా నోటిఫికేషన్లు, షెడ్యూలు విడుదల చేసి నిరుద్యోగ యువత జీవితాలలో వెలుగు నింపాలి అని కోరారు. సమావేశంలో కుళ్లాయప్ప, కదిరి ప్రసాద్ గౌడ్, అబ్దుల్ సత్తార్, సిరాజుద్దీన్, సయ్యద్ సలావుద్దీన్, మొయినుద్దీన్, సుబ్బారెడ్డి, బుల్లెట్ మాబు, సయ్యద్ గౌస్పేర్, శ్యామలమ్మ, నాగరత్న గౌడ్, సంజయ్ కాంత పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వింటున్న తహశీల్దార్ రవిశంకర్

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

ప్రజాశక్తి-కాశినాయన

భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన నరసాపురంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు రీ సర్వేలో జరిగిన పొరపాట్లను, ఇబ్బందులను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించారు. కొందరి భూములు గతంలో ఆన్‌లైన్‌లో ఉన్నాయని, రీ సర్వే తరువాత ఆన్‌లైన్‌లో లేనివి కూడా వచ్చాయని పేర్కొన్నారు. డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథరెడ్డి, మండల సర్వేర్ రామాంజనేయులు, సచివాలయ సర్వేయర్ ప్రభావతి పాల్గొన్నారు.

మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం కడప ఆర్‌డి రామగిడ్డయ్యను ఆర్‌డి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిఎంఎమ్ శిక్షణ పొందిన రెగ్యులర్ ఎఎన్ఎంలకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. సీనియర్ ఎఎన్ఎంలను ఎల్ హెచ్ వి ట్రైనింగ్‌కు పంపాలని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎం ఎఎన్ఎముల రీ డిప్లయిమెంట్‌ను రద్దు చేయాలన్నారు. ఆర్‌డి సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి వేదికను అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పుల భాస్కర్ యాదవ్, జిల్లా అధ్యక్షులు మల్లయ్య, అసోసియేషన్ అధ్యక్షులు, నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ సాదు శీను, విజయ్ కుమార్, అచ్చమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు : కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మంత్రి ఎస్.సవితను విజయవాడలో ఆమె స్వగృహంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బద్వేలు గురుమూర్తి, జాతీయ బి.సి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బి.సి రమణ, యం.బి.సి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వినుకొండ సుబ్రహ్మణ్యం, భాయన శేఖర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. బద్వేలు నియోజకవర్గంలో ఉన్న జనాభాలో బిసిల సమస్యలపై ఆమెను విన్నవించారు. కార్యక్రమంలో జాతీయ బిసి చైతన్య సమితి సలహాదారు మాధవరావు యాదవ్, రజక సంఘం నాయకులు చెన్నయ్య, బిసి నాయకులు జయచంద్ర, సుబ్బరాయుడు యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విగ్నేష్‌ను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - బద్వేలు : బాధిత దస్తగిరమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ప్రకటించి, నిందితుడు విగ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప పేర్కొన్నారు. మానవ మృగం విగ్నేష్ కారణంగా చనిపోయిన దస్తగిరమ్మ కుటుంబాన్ని గుర్రప్పతోపాటు కడప జిల్లా అధ్యక్షులు డిఎస్ జయరాం, బద్వేల్ అసెంబ్లీ అధ్యక్షులు నుసిమి గౌస్‌పీర్ కలిసి దస్తగిరమ్మ చిత్రపటానికి నివాళులర్పించి తల్లిదండ్రులను ఓదార్చి వారికి అండగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో మహిళా జిల్లా నాయకురాలు బేబీ, ఏసోబు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా మీనాక్షి



ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు నూతన డిఇఒలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లాకు మీనాక్షిని నియమించారు. ఈమె సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో పనిచేసిన డిఇఒ అనురాధను రాష్ట్ర కేంద్రానికి బదిలీ చేస్తూ రిపోర్టు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గౌస్‌పీర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ జ్యోతి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది అబ్బాస్ సి. ఎస్. పీరా, షేక్. నాయబ్ రసూల్, షేక్. నూరుల్లా, షేక్. మస్తాన్, నల్ల పోతుల నర్మద పార్టీలో చేరారు. వారు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రోత్సహించిన కాంగ్రెస్ కడప పార్లమెంట్ ఇన్‌ఛార్జి పీస్ సయ్యద్ గౌస్ పీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించుకున్నారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, గోసంగి సుబ్బారెడ్డి, జయ కుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.



గౌస్‌పీర్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

కడప సిడిపిఒను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీ కార్యకర్త రజిని అనారోగ్యానికి కారణమైన కడప సిడిపిఒను సస్పెండ్ చేయాలని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆరోగ్యం బాగాలేక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరిన రజనిని అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, అంజలీదేవి, వినీల, సిఐటియు నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ అర్బన్ సిడిపిఒ సునందకుమారి వేధింపుల వల్ల భయభ్రాంతులకు గురై ఐదురోజుల నుంచి జ్వరం తగ్గలేదని తెలిపారు. గుండెకు నొప్పి రావడం వల్ల మరింత భయానికి లోనై ఆస్పత్రిలో చేరారని చెప్పారు. కడప అర్బన్‌లో పని చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పైన సిడిపిఒ సునంద చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. కడప నగరంలోని సున్నపు బట్టిలు 1 సెంటర్లో పనిచేస్తున్న కార్యకర్త రజనీ సెంటర్‌ను ఈనెల 19న పర్యవేక్షణ పేరుతో సిడిపిఒ తనిఖీ చేసి వర్కర్లను బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. బాలింతలకు, గర్భిణీలకు ఇచ్చే పౌష్టికాహారం కాలం చెల్లినవి ఇచ్చిన సిడిపిఒను అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని చెప్పారు. కాలం చెల్లినవి సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా వర్కర్లను బెదిరించడం, దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. సిడిపిఒపై పీడీకి చాలాసార్లు ఫిర్యాదు చేసినా పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కడప అర్బన్ సిడిపిఒపై విచారణ కమిటీ వేసి నిజా, నిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సిడిపిఒను సస్పెండ్ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



పంట నష్టంపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కమలాపురం టౌన్

కమలాపురం మండలం గంగవరంలో తుపాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి పరిశీలించారు. పంటల నష్టాన్ని వెంటనే అంచనా వేసి త్వరితగతిన నివేదిక తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. కాలువ పూడికతీత పనులు ప్రారంభించాలని సూచించారు. వ్యవసాయ అధికారుల నివేదిక సుమారు ప్రకారం సుమారు 900 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని, నివేదికలు ప్రభుత్వానికి పంపుతామని ఎడిఎ నరసింహారెడ్డి తెలిపారు. రైతులు మాట్లాడుతూ చేతికి అందిన వచ్చిన పంట తుపాన్ కారణంగా పూర్తిగా తడిచి పెట్టుకుపోయిందని ఎకరాకు దాదాపు రూ. 25 వేల ఖర్చు అయిందని, చేతికి వచ్చిన పంట ఎకరాకు సుమారు రూ.70 వేల నుండి రూ. 80 వరకు వచ్చి ఉండేదని పేర్కొన్నారు. తప్పకుండా నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గంగవరం మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పైప్‌లైన్ పనులకు భూమిపూజ..** నగర పంచాయతీ ప్రజల తాగు నీటి కష్టాలను తొలగించడానికి రామ్‌నగర్ నుంచి బీడీ కాలనీ వరకు ఏర్పాటు చేయబోయే పైప్‌లైన్‌కు ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి భూమి పూజ చేశారు.

పంచాయతీల్లో అభివృద్ధి శూన్యం : సిపిఎం

ప్రజాశక్తి-కలసపాడు

పంచాతీల్లో అభివృద్ధి శూన్యమని, 15వ ఆర్థిక సంఘం నిధులు ఇఒపిఆర్‌డి, సర్పంచులు, కార్యదర్శులు ఎక్కడ వినియోగించారో చెప్పాలని సిపిఎం మండల నాయకులు సగిలి గురయ్య ప్రశ్నించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదికి సంబంధించి ఆర్థిక సంఘం నిధులు ఆయా పంచాయతీల సర్పంచులు ఖాతాలో జమ చేశారని, వాటిని వేటికి ఖర్చు చేశారో తెలియడం లేదని, గ్రామాల్లో మాత్రం సమస్యలు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. కనీసం వీధిలైట్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, తాగునీరు వంటి వసతులు కూడా కల్పించలేదని వాపోయారు. వెంటనే సంబంధితాధికారులు నిధులను పంచాయతీ అభివృద్ధికి వినియోగించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్ప కుమారి తెలిపారు. గురువారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రూటు మేరీ ,ఇంగ్లీష్ టీచర్ కైలాస్, పిఈటి రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

బేడ బుడగజంగాలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప

బేడ బుడగ జంగాలకు సత్వరమే న్యాయం చేయాలని కడప ఎమ్మెల్యే మాధవికి బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డి. రాజు, సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం బేడ బుడగ జంగాలను ఎస్‌సి జాబితాలో చేరుస్తామని తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. స్పందించిన మాధవి మీకు అడ్డుగా వున్న 144 జీవోను రద్దు చేసేలా కేబినెట్‌లో గతంలో తీర్మానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేష్, మల్లి, లోకేష్, సుధాకర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షిం చుకో వాలని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదా దేవి సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని వివే కానంద మహిళా డిగ్రీ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం' పై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అనగా ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, మనస్సు చదువు, కళలు, క్రీడల పట్ల ఏకాగ్రత కలిగి, మంచి వున్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. స్టెప్, ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయి గ్రేస్ మాట్లాడుతూ దేశ జనాభాలో యువత 33 శాతం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, కరస్పాండంట్ మనోహర్ రెడ్డి, ప్రిన్సిపల్ నాగమణి, స్టెప్, మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది అబ్బాస్ అల్లి, టి.నాగయ్య, వి.వి. నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-అట్లూరు

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి జట్టులో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 4 నుంచి 6 వరకు చెన్నైలో నిర్వహించిన అండర్ - 19 జూనియర్ సౌత్ జోన్ టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంటులో కస్తూబా పాఠశాల నుంచి 8 మంది విద్యార్థి నులు పాల్గొని తమ ప్రతిభను కనబరించారు. ఎపి తరుపున రాష్ట్ర జట్టులో పాల్గొని ప్రథమ స్థానంలో స్థాధించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థి నులను ప్రత్యేక అధికారి ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రమీల, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు



మాట్లాడుతున్న మహమ్మద్ షబ్బీర్

ఇసుక పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న ఉచిత ఇసుక పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, సీనియర్ నాయకుడు పివి రమణ పేర్కొన్నారు. స్థానికంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం వల్ల కొందరు ట్రాక్టర్ల యాజమానులు ఇష్టారాజ్యంగా పాపాఘ్ని నది నుంచి తవ్వకాలు చేసి డంప్‌లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారని, కట్టడి చేయాలని కోరారు. పాపాఘ్ని నదిలో నీటి బోర్లు ఉన్న ప్రాంతాల్లో ఇసుకను తరలించడం ద్వారా నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందన్నారు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఇసుకను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో టిడిపి మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఫయాజ్, లాడెన్ మహబూబ్ షరీఫ్, ఇలియాస్ పాల్గొన్నారు.

రేపు ముద్దనూరు మండల సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో విద్య, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, ఉపాధి, గృహాలు, వ్యవసాయం, రోడ్లు, విద్యుత్ మొదలైన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, మండల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగ విద్యార్థులు పుట్టగొడుగుల పెంపకంపై గురువారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణలో పాల్గొన్నారు. కడప యోగి వేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమతి శంకర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను నిర్వహించారు. సైన్స్ పార్క్ ప్రయోగశాలలను, ఖనిజాల వర్ధన ఉపయోగాలను టి.చంద్రశేఖర్ విద్యార్థులకు వివారించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదులలో నేర్చుకున్న అంశాలను అధునాతన ప్రయోగశాలలో శిక్షణ పొందడం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వారిని భావి శాస్త్రవేత్తలుగా ఎదిగే విధంగా ప్రోత్సహించడం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పివి కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - దువ్వూరు

ఈనెల 30వరకు నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ సెంటర్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. ఈనెల 25న గుడిపాడు జడ్పీ హైస్కూల్, 26న నీలాపురం జడ్పీ హైస్కూలు, 28న కానగూడూరు ఎంపియుపి స్కూల్, 29న చింతకుంట జడ్పీ హైస్కూల్, 30న జడ్పీ హైస్కూల్ మాచనపల్లిలో ఆధార్ సెంటర్ ఉంటుందని ఆయన వివరించారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ముకుందరెడ్డి

ప్రత్యేక ఆధార్ క్యాంపు పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

యామవరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపును గురువారం ఎంపిడిఒ ముకుందరెడ్డి పరిశీలించారు. ప్రత్యేక ఆధార్ క్యాంపును విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వీరభద్రుడు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో సిఇఎంఎస్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో భారత ప్రభుత్వ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆఫ్ ఎసెలైన్ ఇన్ మారీ టైమ్ షిప్ బిల్డింగ్ విశాఖపట్నం వారు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ సిఇఎంఎస్ చేసుకున్న ఎంఒయూలో భాగంగా బిటెక్ ఇఇఇ ఇసిఇ మూడవ, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సిఇఎంఎస్ కో- ఆర్డినేటర్ నేహారెడ్డి, సీరియల్ టెక్నికల్ ఇంజనీర్ శ్రీలత, శివప్రభు, కే షర్మిల, సౌజన్యచే ఎలక్ట్రికల్ డిజైన్ అనే అంశాన్ని, ఇఇఇ మెకానికల్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అనే అంశంపై ఇసిఇ రెండు రోజుల వరకు షాపు ప్రారంభించారన్నారు. ఒకరి నాలెడ్జ్‌ని ఒకరు షేర్ చేసుకోవడానికి ఫ్యూచర్లో మంచిస్థాయి చేరుకోవడానికి ఈ వర్క్‌షాపు దోహదపడుతుందని తెలిపారు. సిప్లాన్ సాఫ్ట్వేర్ ట్రైనింగు, ఇసిఇ పిఎల్‌సి హార్డ్‌వర్క్‌పై ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ కెవి మోహన్ రావు మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థులు వారి ఉద్యోగ భవిష్యత్తు కోసం వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరెస్పాండెంట్ బసిరెడ్డి వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి

పైడిపాలెం రిజర్వాయర్ ఆధునికీకరణ

రూ.4.5 కోట్లతో పనులు ప్రారంభం - లీకేజీల నివారణకు చర్యలు



పైడిపాలెం రిజర్వాయర్ వద్ద జరుగుతున్న పనులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గానికి ప్రధాన సాగునీటి వనరు పైడిపాలెం రిజర్వాయర్ ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాదాపు రూ.4.5 కోట్లతో పనులను చేపట్టారు. 2010లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం మినహా అన్ని మండలాలకు సాగునీటిని అందించేలా రిజర్వాయర్‌ను రూపకల్పన చేశారు. ఈ రిజర్వాయర్‌లోకి గండికోట ప్రాజెక్ట్ నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని పంపింగ్ చేసేలా ఆరు టిఎంసి సామర్థ్యంతో నిర్మించారు. ప్రాజెక్టు పరిధిలోని మల్లెల, హిమగుంట్ల ఫీడర్ ఛానల్ ద్వారా దాదాపు 40 వేల ఎకరాలకు సాగునీరు ఆయకట్టుకు, 8 చెరువులు నీటితో నింపే విధంగా రూపకల్పన చేశారు.

లీకేజీల నివారణకు చర్యలు ప్రారంభం..

దాదాపు రూ.60 లక్షలతో రిజర్వాయర్ లీకేజీ నివారణ పనులను చేపట్టారు. 4.5 టిఎంసి కంటే అధికంగా నీరు నిలువ చేసినట్లయితే లీకేజీలు వస్తున్నాయి. దీని నివారణకు అధికారులు పనులను ప్రారంభించనున్నారు. ఇటీవల 5.5 టిఎంసి నీరు నిల్వ చేయడంతో రిజర్వాయర్ నుంచి నీరు లీకేజీ అవుతున్నాయి. ఈ విధంగా నీరు వృథాగా పోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అదేవిధంగా రిజర్వాయర్‌పై రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగింపు పనులు చేయనున్నారు. రిజర్వాయర్ వద్దకు పోవడానికి ఉన్న రోడ్డు మరమ్మతు, రిజర్వాయర్ నుంచి హిమకుంట్ల ఫీడర్ కెనాల్ 0,0 వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు లావనూరు సమీపంలోని సాయిబాబా ఆలయం దగ్గర కాలువ వద్ద పైపు కల్వర్టు నిర్మించనున్నారు. రిజర్వాయర్ చుట్టూ గతంలో ఏర్పాటు చేసిన ట్రోయ్ డ్రైన్ పూడికతో నిండిపోవడంతో మట్టిని తొలగించే పనులు చేయనున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి ..

పైడిపాలెం రిజర్వాయర్ వద్ద లీకేజీ నీరు నివారణతోపాటు ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఆ మేరకు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యాయి. మేజర్‌గా బ్రిడ్జిల నిర్మాణం, లీకేజీ పనులు త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. **- శ్రీనివాసులు, ఇఇ, గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు**



పైడిపాలెం రిజర్వాయర్

ఇన్‌ఛార్జి కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు



సమస్యలు వింటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అతిథిసింగ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని ముడుమాల గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఇన్‌ఛార్జి కలెక్టర్ అతిథిసింగ్ దృష్టికి పలు సమస్యలు వచ్చాయి. మండల టిడిపి అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సత్వరమే రీ సర్వేలో భూములు కోల్పోయిన వారికి, హైవే రోడ్డు పనుల నిమిత్తం రైతుల నుండి భూములు ప్రభుత్వం తీసుకున్న వారికి వెంటనే నష్టపరిహారాన్ని రైతులకు అందజేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అతిథిసింగ్‌ను కోరారు. ఎన్నో సంవత్సరాలుగా డికెటి భూములు సాగు చేసుకుంటున్న వారికి కూడా నష్టపరిహారం అందజేయాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ డికెటి భూములకు సంబంధించి కవరింగ్ లెటర్, టెన్ వన్ అప్లికేషన్ తప్పనిసరిగా జత చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్ భూములు ఇసి, ట్రాన్సెక్షన్ సంబంధించిన రికార్డ్స్‌ను పొందుపరిచి పంపాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్, తహశీల్దార్ దామోదర్‌రెడ్డి, డిటి జాన్సన్, మండల టిడిపి నాయకులు ఎల్లటూరు సాంబశివరెడ్డి, మేకల సుధాకర్ యాదవ్, నాగయ్య, వీరయ్య, సన్నబోయిన శీను, స్థానిక సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్,, రఫాయేలు, కలగొట్ల సిద్దయ్య, రమణయ్య, బాబు, శ్రీనివాసులు, ప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో భూ సర్వేతో తలెత్తిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని టిడిపి సీనియర్ నాయకుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హిమకుంట్లలో గురువారం భూసర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన సర్వేలో అనేక తప్పులు దొర్లాయని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. భూముల్లో ఎక్కువ భాగం విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, ఈ కారణంగా బ్యాంకులలో రుణాలు పొందాలంటే కష్టంగా ఉందన్నారు. అర్జీ ఇచ్చిన ప్రతి రైతు వివరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సభలో 69 మంది రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, డిటి శ్రీహరి బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బస్సు షెల్టర్‌లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్సు షెల్టర్‌ను కూల్చేస్తున్న జెసిబి యంత్రం(ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం ఐదు రోడ్ల కూడలిలో ఉన్న బస్సు షెల్టర్‌ను మఠం అభివృద్ధి పేరుతో తొలగించారు. ఇంతవరకు పనులు ప్రారం భించలేదు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారి భక్తులు, స్థానిక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎండ, వానలకు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం నడిరోడ్డుపై వేచి చూడాల్సిన పరిస్థితి. అటు దేవస్థాన యాజ మాన్యం, ఇటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. ప్రయాణికుల పరిస్థితి దయనీయంగా ఉన్నా సంబంధిత అధికారులల్లో ఏ మాత్రం చలనం లేదనే విమర్శలున్నాయి. దీనిపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవ చూపాలని, సొంత మండలాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఆయపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న షేక్ షేక్షావలి

బాధితులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ మానవ హక్కుల అవగాహనా సంఘం జమ్మలమడుగు డివిజనల్ చైర్మన్‌గా జమ్మలమడుగుకు చెందిన షేక్ షేక్షావలి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు ముందుగా కమిటీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ పరిధిలో మానవ హక్కుల పరిధి కిందికి వచ్చే ప్రతి విషయంలో పాల్గొని బాధితులకు అండగా ఉంటామన్నారు. తనను బుధవారం కడప పాత బస్టాండ్ సమీపంలోని శ్రీ అవధూతేంద్ర స్వామి కల్యాణమండపంలో జరిగిన గ్రా జిల్లా సభ్యుల సర్వసభ్య సమావేశానికి ప్రపంచ మానవ హక్కుల అవగాహనా సంఘం (గ్రా) వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ కాసల కోనయ్య హాజరై పలు అంశాలు చర్చించారన్నారు. కాసుల కోనయ్యచే జమ్మల మడుగు డివిజనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం గర్వంగా ఉందన్నారు.

పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. స్థానిక 42, 43, 44 సచివాలయ పారిశుధ్య సిబ్బందితో గురువారం బుర్ర సాధుమఠం ప్రాంతంలో ఆయన కాలువలను పరిశీలించారు. కాలువలలోని పూడికను తీయించారు. బొల్లవరం దళితవాడలోని మడూరు కాలువ వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. పారిశుధ్య పనులు, మడూరు ఛానల్ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని మడూరు ఛానల్‌లో పూడిక తీత పనులు సత్వరం చేపట్టాలని ఆదేశించారు. పూడిక తీయకపోవడం వల్ల నీటి ప్రవాహం సరిగ్గా జరగక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. పూడిక తీత పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను మురుగు కాలువలలో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని పారిశుధ్య కార్మికులను కమిషనర్ మల్లికార్జున ఆదేశించారు.



పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్



యంత్ర టు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

జెఎన్‌టియులో జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ పరిధిలోని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మూడురోజుల జాతీయ సదస్సు యంత్ర-2కె 24ను ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిధిగా తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ హెడ్ మెకానికల్ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి విచ్చేశారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి దాదాపు 500మంది విద్యార్థులు హాజరయ్యారు. హై స్పీడ్ (ఎఫ్ త్రీ కార్ మోడల్) ఎలక్ట్రికల్ వెహికల్, హ్యూమనైడ్ రోబోటిక్స్‌పై విద్యార్థులకు మూడురోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్ త్రీ కార్ డిజైన్, రోబోటిక్స్ పాత్ర ప్రాముఖ్యతను వివరిం చారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాప కులు పాల్గొన్నారు.



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న శివమ్మ, భూపేష్‌రెడ్డి, మెప్మా అధికారి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. స్థానిక మున్సిపల్ క్లస్టర్ పాయింట్ వద్ద గురువారం మెప్మా అధికారి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఈ మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పట్టణంలోని మహిళలు మెప్మా ద్వారా బ్యాంక్‌ల నుండి రుణాలు పొంది వివిధ రంగాల్లో అభివృద్ధి చెందేలా ఆలోచించాలన్నారు. అనంతరం చైర్మన్, మెప్మా అధికారి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా మహిళ సాధికారత సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టిన ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు

ప్రజాశక్తి - చాపాడు

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి అయిదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు సూచించారు. ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సిలో డాక్టర్ ఓబులేసు, సిహెచ్‌ఒ మహాదేవ్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో పేరు వింటేనే ప్రజలు భయపడిపోయేవారని తెలిపారు. ఒకప్పుడు ఈ వ్యాధికి మందులు లేకపోవడంతో పోలియో నుండి పిల్లలను కాపాడుకోలేక పోయారని వివరించారు. ప్రస్తుతం ఈ వ్యాధికి వ్యాక్సిన్ వచ్చి భారతదేశం నుండి పారదోలారని పేర్కొన్నారు. పోలియో చుక్కల మందు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం, శనివారం ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ మహదేవ్ యాదవ్, అరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి, ఫార్మసీ అధికారి సుభాషిణి, సిబ్బంది సావిత్రి, సునీత, శాంత కుమారి, నరేష్, ప్రజలు పాల్గొన్నారు .

అధిక ధరలను నియంత్రించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసుల దుకాణా దారులు అధిక ధరలకు విక్రయించకుండా నియంత్రించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఎన్జీవో కార్యాలయంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసిశ్వర్ యాదవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వినో దాన్ని వ్యాపారంగా చేసుకుని పట్టణంలో టపాసుల దుకాణాల యాజ మాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. గతంలో ప్రతి ఏడాది ఇలాగే జరిగేదన్నారు. నిబంధనలు పాటించని దుకాణాల లైసెన్స్ రద్దు చేయా లన్నారు. కొన్న వస్తువులకు బిల్లులు కూడా ఇవ్వరని తెలిపారు. అంతా జిరో బిజి నెస్ చేస్తూ వస్తున్నారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖల అధి కారులు పక్కాగా నిబంధనలు పాటించే వారికే లైసెన్సులు ఇవ్వాలని సూచించారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎస్టీ, ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ గురువారంతో ముగిసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేంద్ర బాబు తెలిపారు. 15 రోజులుగా ఈ శిక్షణ కార్యక్ర మం కొనసాగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్లో ఉన్న అటల్ టిక్కర్ ల్యాబ్ నిర్వహణకు సంబంధించి డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ గురుకుల పాఠశాలలో, ట్రిపుల్ ఐటి కళాశాల మధ్య అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. అందులో భాగంగా ట్రిపుల్‌ఐటి కళాశాల యాజమాన్యం మూడేళ్ల కాల పరిమితిలో పాఠశాల ల్యాబ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ ఎవిఎస్ఎస్ కుమారస్వామి గుప్తా, పరి పాలన అధికారి డాక్టర్ పి రవికుమార్, అకాడమిక్ రమేష్ కైలాస్, వైస్ ప్రిన్సిపల్ హరినాథ్‌రెడ్డి, ఎస్సీఎస్టీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కల్యాణచక్రవర్తి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ సత్యానంద, విజయ్ కుమార్, ట్రిపుల్ ఐటి అధ్యాపకులు రవి, మని కిరణ్, భాస్కరయ్య సువర్ణ, లిడియా, హేమ చంద్ర, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో కుమారస్వామి గుప్తా, సురేంద్రబాబు